క్లుప్తంగా

మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ శాఖాధికారి

దెందులూరు : ఏలూరు రూరల్ మండలంలో 82 మట్టి నమూనాలు సేకరించామని ఏలూరు రూరల్ మండలం వ్యవసాయ శాఖ అధికారిని ఎ.జీవన సంధ్య అన్నారు. శుక్రవారం పాలగూడెంతోపాటు ఇతర గ్రామాల్లో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు నమూనా సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. రైతులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏలూరు రూరల్ మండలానికి 500 మట్టి నమూనా సేకరించాల్సి ఉండగా, వర్షాలు కారణంగా 82 మట్టి నమూనాలే సేకరించామని జీవన సంధ్య తెలిపారు. త్వరగా లక్ష్యం పూర్తి చేసేందుకు రైతులు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహిళను రక్షించిన శక్తి టీమ్



మహిళకు కౌన్సెలింగ్ ఇస్తున్న శక్తి టీమ్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ఒక మహిళ కుటుంబ కలహాల నేపథ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు నెంబర్ 112కు ఫోన్ చేయగా శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మహిళను రక్షించింది. ఏలూరు శక్తి టీం ఇన్‌చార్జి సీఐ ఎం సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన శిరీషకు వివాహమైంది. భర్త ఆన్ లైన్ ట్రేడింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో కుటుంబంలో కొద్ది రోజులుగా కలహాలు చోటుచేసుకుని ఆమె తీవ్ర మనస్థాపానికి గురైంది. శుక్రవారం సాయంత్రం ఎస్ఆర్ పేటలోని ఎస్ఆర్‌ఐ కళాశాల సమీపంలోని రైలు పట్టాల వద్దకు ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు 112కు సమాచారం ఇవ్వడంతో నిమిషాల్లోనే పోలీస్ శక్తి టీం ఆమె వద్దకు చేరుకుంది. ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శక్తి టీం సభ్యులను ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు.

సృజనాత్మక శక్తి పెంపే లక్ష్యం

- విద్యార్థులకు ఆరేళ్లుగా వేసవి శిక్షణా శిబిరాలు
- హేలాపురి బాలోత్సవం, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరులో ప్రత్యేక కార్యక్రమాలు



వివిధ చిత్రాల ఆకృతులను తయారు చేసి చూపుతున్న చిన్నారులు



ఆదివారపుపేట ఏడీజీఆర్‌కే స్కూల్లో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు





పేపర్ క్రాఫ్ట్స్ తయారు చేసి చూపుతున్న చిన్నారులు, కందుకూరి వీరేశలింగం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడంతో పాటు వారికి విజ్ఞానం, వినోదం పెంపొందించే విధంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపూరి బాలోత్సవం కమిటీలు గత ఆరేళ్లుగా వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదం, విజ్ఞానం అందిస్తున్నాయి. సామాజిక అంశాల పట్ల అవగాహన కల్పిస్తున్నాయి. మూడనమ్మకాలను ప్రారదోలుతూ సైన్స్ భావజాలం పెంపొందిస్తున్నాయి. ఈ ఏడాది ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవన్‌లో స్పోకెన్ ఇంగ్లిష్, ఏఆర్‌డీజీకే స్కూల్‌లో సెంట్రలైజ్డ్ క్యాంప్, నాగేంద్ర కాలనీ, బీడీ కాలనీల్లో ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

నేర్పుతున్న ప్రత్యేక అంశాలు ఇవే..

విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలిగించే విధంగా ఆటలు, పాటలు, డాన్స్, కోలాటం, డ్రాయింగ్, బెస్ట్‌ఫ్రం వేస్ట్ వంటివి నేర్పుతున్నారు. ఆడపిల్లలకు ఆత్మ రక్షణకు ఉపయోగపడే కరాటే, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, వంటి సెల్ఫ్ టెక్నిక్స్ నేర్పుతున్నారు. సమాజ శ్రేయస్సుకు పాటు పడే విధంగా దేశ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, మహానేతల జీవిత చరిత్ర విశేషాలను వీడియోల ద్వారా వివరిస్తున్నారు. సమాజంలో తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే విధంగా విద్యార్థుల్లో ఆలోచన కలిగిస్తున్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణా శిబిరాలకు పలు ప్రజా సంఘాలు సహకరిస్తున్నాయి.

కళలు నేర్పే ప్రయత్నం



భారతీయ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలైన కళలను నేర్పే ప్రయత్నం చేస్తున్నాం. చిన్నారులకు సెల్ఫ్ డిఫెన్స్ రక్షణ వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పుతున్నాం. విజ్ఞానం, లోకజ్ఞానం వీటికి జతగా డ్యాన్స్‌లు, కళలు నేర్పిస్తున్నాం. వీటిని నేర్చుకునేందుకు చిన్నారులు పెద్ద ఎత్తున వేసవి శిక్షణా శిబిరాలకు తరలివస్తున్నారు.

– గుడిపాటి నరసింహారావు, కార్యదర్శి, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, ఏలూరు

విజ్ఞానం పెంపొందించే దిశగా ..



ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవ కమిటీల ఆధ్వర్యంలో గత ఆరేళ్లగా విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఈ శిబిరాల్లో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించే దిశగా కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. శిబిరాల నిర్వహణలో నగరంలోని వివిధ ప్రజా సంఘాల సహకారం తోడ్పాటు అందిస్తున్నాయి. ముఖ్యంగా వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వారి విజ్ఞానాన్ని మరింత పెంపొందించేలా చూస్తున్నాం.

– కె.జనని, సమ్మర్ క్యాంపు ట్యూషన్ సెంటర్ కోఆర్డినేటర్, ఏలూరు

యోగాచరణ దిశగా ప్రోత్సహించాలి



యోగాచారణపై మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : రాష్ట్ర వ్యాప్తంగా కనీసం రెండు కోట్ల మందికి యోగాలో ప్రవేశం లక్ష్యంతో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు వట్లూరులోని టీటీడీసీలో, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మనిషి జీవన నాణ్యతను పెంచేందుకు శ్రేయస్సుకు, యోగా గొప్ప మార్గమని తెలిపారు. ఇతివృత్తం, ఆధారిత యోగా సెషన్లతోపాటు వివిధ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. ట్రైనర్లు, పౌరుల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ నెల రోజులపాటు యోగాసనాలు అభ్యాసంతోపాటు ఆసనాల ప్రదర్శన, సూర్య నమస్కారం, ప్రాణామాయ ప్రదర్శన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మరో ముగ్గురిని యోగాచరణ దిశగా ప్రోత్సహించాలన్నారు.

నేడు పాస్టర్ ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థ సభ



మాట్లాడుతున్న ఫాస్టర్ అసోసియేషన్ సభ్యులు

దెందులూరు: సువార్తికుడు ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థ సభ శనివారం రాజమండ్రి కొంతమూరు ప్రకృతి వేదిక వద్ద సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, జిల్లా పాస్టర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పాల్ ఆశీర్వాదం, ఉపాధ్యక్షుడు పాస్టర్ పీవీ రాజు, పాస్టర్ జీపీ అబ్రహాం తెలిపారు. శుక్రవారం పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏలూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రవీణ్ పగడాల కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

ప్రారంభోత్సవానికి నోచుకోని సచివాలయ భవనాలు

అవస్థలు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



ధర్మాజీగూడెంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం

లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోపోవటంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో మొత్తం 19 సచివాలయ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అయితే వీటిలో 12 సచివాలయాలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేయటంతో ఉద్యోగులు ఆ భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అనివార్య కారణాలతో తోచలకరాయుడుపాలెం, కొత్తపల్లి, రంగాపురం, ధర్మాజీగూడెం-2లో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. ధర్మాజీగూడెం-1, లింగపాలెం, మఠంగూడెం గ్రామాల్లో కూడా సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో జనరల్ ఎన్నికల కోడ్ రావటంతో వీటి ప్రారంభోత్సవం నిలిచిపోయింది.

కూటమి ఏర్పడి ఏడాది కావస్తున్నా..

అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆ మూడు గ్రామాల్లో నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నప్పటికీ నేటికీ వీటిని ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీంతో అయా గ్రామాల్లో ఇరుకు భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వర్తించటం, మరో వైపు సచివాలయాలకు వెళ్లిన ప్రజలకు సరైన సదుపాయాలు లేకపోవటంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇరుకు గదుల్లో, ఉక్కపోతలో మగ్గి ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు ఏడాది కాలంగా ప్రారంభోత్సవం చేయకపోడటంతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహం చెందుతున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే సచివాలయ భవనాలను ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి తీసుకు రావాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



సాగునీటి చెరువులో మట్టి తవ్వుతున్న దృశ్యం

కొయ్యలగూడెం: పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెం గ్రామ శివారులోని సాగునీటి చెరువులో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. 20వ తేదీతో తవ్వకాల అనుమతులు పూర్తయినప్పటికీ మూడు రోజుల నుంచి రేయింబవళ్లు మట్టి తవ్వకాలు చేస్తున్నారని సాగునీటి చెరువు రైతులు శుక్రవారం ఆరోపించారు. వ్యవసాయం చేసే పొలాల్లోకి మట్టి తీసుకెళ్లడానికి మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతి ఉన్నా, ఇటుక బట్టీలకు, ఇక్కడి నుంచి తెలంగాణ వరకు లారీలతో మట్టిని తరలిస్తున్నారన్నారు. చెరువు వ్యాసార్థం అనుసరించి రెండు వేలు క్యూబిక్ మీటర్ల నుంచి పది వేల క్యూబిక్ మీటర్ల వరకు అనుమతులు ఇస్తున్నా దాదాపుగా ఇచ్చిన పర్మిషన్ కన్నా పది రెట్లు తవ్వుతున్నారని దీని వలన పశువులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పెద్దలు సిండికేట్‌గా వ్యవహరిస్తూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మట్టి తవ్వకాలను నిర్వహిస్తున్నారన్నారు. ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మట్టి అక్రమార్కులకే పూర్తి మద్దతిస్తున్నారని వాపోయారు. మట్టి తవ్వకాలపై ప్రజలు అనేక ఫిర్యాదులు సంబంధిత అధికారులకు ఇచ్చినా దానిపై కనీసం ఎలాంటి స్పందన లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రమాదకరంగా పాలగూడెం వంతెన



ప్రమాదకరంగా మారిన పాలగూడెం వంతెన

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం పాలగూడెం లాకుల వద్ద వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నిత్యం ఐదు వేల మందికి పైగా ప్రయాణికులు ఏలూరు వైపు ఏలూరు నుంచి పాలగూడెం, కొవ్వలి, దోసపాడు, పోతునూరు, కేతవరం, గుండుగొలను గ్రామాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. లాకులు వద్ద వంతెన కుడివైపు సగం పూర్తిగా విరిగిపోయి ఉంది. ఈ వంతెనపై ఏమాత్రం ఆదమరచినా కిందకి పడిపోవడం ఖాయంగా ఉంది. త్వరితగతిన వంతెనపై రక్షణ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

దెందులూరు: మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆహార ఆరోగ్య జాగ్రత్తలు, వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. శుక్రవారం పోతునూరు పరిధిలోని పలు ఉపాధి శ్రామికులకు, ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలు సూచనలు చేశారు. ఎంపీహెచ్ఓ హరి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఉన్నత పాఠశాలలో ఆధునికీకరణ పనులు

దెందులూరు : దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల కళాశాలలో ఆధునికీకరణ పనులు ప్రారంభించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రావు అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలలో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలను ఇటీవల కళాశాలగా పదోన్నతి పొందిన నేపథ్యంలో పెరిగిన విద్యార్థులు అదనపు తరగతి గదులు పూర్తి సౌకర్యవంతంగా ఉండేందుకు ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు.

25న శుద్ధీకరణ మాత మహోత్సవం

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఈనెల 25న శుద్ధీకరణ మాత మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆ చర్చి పారిస్ ప్రీస్ట్ ఫాదర్ గోడే అమ్మన్ రాజా అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి బాల ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నట్టు చెప్పారు. దెందులూరు విచారణ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల భక్తులు మహోత్సవంలో పాల్గొన్నాలని ఆయన కోరారు.

రాజశేఖర్ మృతి తీరని లోటు



రాజశేఖర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: స్థానిక బీడీ కాలనీ కుమ్మరి రేవు ప్రాంతానికి చెందిన జోరింగుల రాజశేఖర్ గుండె పోటుతో మరణించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయ ప్రకాష్ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజశేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాజశేఖర్ మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన మృతికి నాయకులు గుడిదేశి శ్రీనివాస్, మున్నుల జాన్ గురునాథ్, కిలాడి దుర్గారావు, రంగారావు, చొటపల్లి రాజు, వడ్డే నవీన్, జిజ్జువరపు హేమ చంటి సంతాపం తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

దెందులూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆ పార్టీ దెందులూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమితురాలైన మేదినరావుపాలెం మాజీ సర్పంచ్ అంగడాల సీతారావమ్మ అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కారకులైన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దెందులూరు: ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం లేకపోతే జీవితంలో సాధించేదేమీ ఉండదని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం దోసపాడులో పలు వీధుల్లో డ్రై డేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్లెక్సీలు చేతపట్టుకుని వ్యక్తిగత సామూహిక పరిశుభ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంటువ్యాధులు పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, ఎంపీహెచ్ఈఓ హరి పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి, మహిళలు

ద్వారకాతిరుమల: వ్యక్తిగత సామాజిక అభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని తిరుమలంపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం 2.0 సెషన్-7 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య, కెరీర్ మార్గదర్శకాలు, నైపుణ్యాల ప్రాముఖ్యతను మేరి తెలియజేశారు. అంతే కాకుండా చదువుకోవడం వలన విలువలు పెరుగుతాయన్నారు. విద్యా వ్యవస్థ మధ్యలో బడి మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్స్ ద్వారా చదువుకోవచ్చన్నారు. అనంతరం సచివాలయ మహిళా కార్యదర్శి ఎస్‌కే అఫ్రీన్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమన్నారు. ఏఎన్ఎం నాగదుర్గ కిశోర బాలికలతో యోగా చేయించారు. అనంతరం గ్రామంలో విద్యా ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ ఏసమ్మ, అంగన్‌వాడీ ఆయా సాయమ్మ, జ్యోతి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

జంగారెడ్డిగూడెం: నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రభుకుమార్ తెలిపారు. శుక్రవారం నవోదయం 2.0లో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రభుకుమార్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాలను ఏ, బీ, సీ కేటగిరిలో ఉన్న గ్రామాలను ఈ నెల 31వ తేదీలోగా నాటుసారా రహిత గ్రామాలుగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

అహల్యాబాయి జయంత్యుత్సవాలకు పిలుపు

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధురాలు, మరాఠా రాజ్య సామ్రాజ్యవాది అహల్యాబాయి హోల్కర్ త్రి శతజయంత్యుత్సవాలు ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శరణాల మాలతీరాణి పిలుపు ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం వెంకయ్యపాలెంలోని శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళా మోర్చా కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అహల్యాబాయి ఈ నెల 31వ తేదీకి జన్మించి 300 సంవత్సరాలు కాబోతుందన్నారు. కార్యక్రమంలో బొల్లిన నిర్మల కిషోర్, డాక్టర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	11
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	17
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	07
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	22	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40